

కనువిందు.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రముఖ భరతనాట్య గురువు సంతోష్‌కుమార్ తమంగ్ శిష్యబృందం నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో భాగంగా భరతనాట్యాభివృద్ధికి కృషి చేసిన కీర్తిశేషులు విద్వాన్ టీకే. నారాయణ్ శత జయంతి వేడుకలు, నారాయణీ నాట్యాలయ సంస్థ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో పుష్పాంజలి, జతిస్వరం, అలరిపు, శబ్దం, పదవర్ణం, శివస్తుతి, కృతి, కీర్తనం, త్యాగరాజ కృతి, తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో గురువులు డాక్టర్ యశోదఠాకూర్, డాక్టర్ విజయ్ పథలోత్, అన్నారావు తదితరులు పాల్గొన్నారు. కళాకారులు రిథిమా, అస్మిత, సోమా, ఉర్విజ, మాన్వి, నిర్విజ్ఞా, పార్వతి, శాన్వి, సహస్ర, హరిణి, భవ్య, మౌనిక, అనన్య, జనశ్రీ, హర్షిత, ఇషిత, సుషమ్న, అంకిత, భవ్య, స్వాతిక, వీరింద, శరణ్య, యోహన, స్తుతి, ఐశ్వర్య, పియూషి, రుచిత తదితరులు పాల్గొన్నారు.

రెంటల్స్.. జర జాగ్రత్త

- ఇళ్ల ఫొటోలు చూసి మోసపోవద్దు
- చెక్ చేసుకోకుండా గూగుల్ పే, ఫోన్‌పే చేయొద్దు
- మాదాపూర్ క్రైం సీఐ రమేష్ నాయుడు

బ్రోకర్స్ యాప్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి



మాదాపూర్: ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. చదువుకున్నవారు, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఈ మోసాల బారినపడుతున్నారు. లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. జాబ్, లోన్, ఇన్‌స్టా, రిలేషన్ షిప్, డేటింగ్, మ్యాట్రిమోని, లాటరీ, హనీట్రాప్ పేరిట మోసగిస్తున్నారు. ఇదిలా ఉంటే నగరంలో అద్దె ఇళ్ల కోసం పలువురు బ్రోకర్‌లను, బ్రోకర్స్ యాప్‌లను వినియోగిస్తున్నారు. ఐటీ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఇళ్ల కోసం యాప్‌లను సంప్రదిస్తుండగా వారికి ఆకర్షణీయమైన ఇళ్ల ఫొటోలను, వివరాలు పంపించి వారి వద్ద నుంచి ఆధార్‌తో పాటు కొంత నగదును తీసుకుని రీఫండ్ అని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. నగదు రాగానే ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు పబ్లిక్ ప్రాంతాలలో, కార్యాలయాలలో, కమ్యూనిటీలలో, కాలనీలలో, అసోసియేషన్‌లలో ఆన్‌లైన్ మోసాల గురించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామని మాదాపూర్ క్రైం సీఐ రమేష్ నాయుడు తెలిపారు. సైబర్ బారిన పడి డబ్బు పోగొట్టుకుంటే గంట లోపల ఫోన్ 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పాస్‌పోర్టులు, పాన్‌కార్డులు, డ్రగ్స్ మీరు పంపించిన పార్సిల్‌లో ఉన్నాయి అని ఫోన్ కాల్స్‌తో భయభ్రాంతులను చేసి డబ్బు కాజేస్తున్నారని ఇలాంటి వాటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ మోసాలపై ఆయన పలు విషయాలను సాక్షికి వెల్లడించారు.

ప్ర: ఎక్కువగా ఎలాంటి సైబర్ నేరాలు జరుగుతున్నాయి.?

జ: జాబులు ఇప్పిస్తామని, లోన్‌కు ఎలిజిబుల్ ఉందని, గిఫ్ట్ ఓచర్లు గెలుపొందారని, రిలేషన్‌షిప్, చాటింగ్, పార్సిల్స్ లాంటి వినూత్న రీతిలో ప్రజలను భయపెట్టి నగదు వసూలు చేస్తున్నారు. డబ్బు వచ్చిన తరువాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైన సమస్య వస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలి.

ప్ర: అద్దె ఇళ్ల కోసం వచ్చిన వారిని ఎలా మోసగిస్తున్నారు?

జ: మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో ఇళ్లు వెతుక్కోవడం కష్టంగా ఉండడంతో చాలామంది బ్రోకర్‌లను, యాప్‌లను వినియోగిస్తున్నారు. అందమైన ఇళ్లు చూపించి రెంట్ తక్కువ అని చెప్పి వారి వద్ద నుంచి సెక్యూరిటీ డిపాజిట్ 2వేలు, ఆధార్ కార్డు ఇవ్వాలని నమ్మబలికి వారి వద్ద నుంచి డబ్బును తీసుకుని ఫోన్ ఆఫ్ చేస్తున్నారు. చాలా మంది ఇలా మోసపోతున్నారే తప్ప ఫిర్యాదులు ఇవ్వడం లేదు. ఇలాంటి విషయాలపై ఫిర్యాదు చేయాలి.

ప్ర: సైబర్ బారినపడి డబ్బు పోగొట్టుకుంటే రికవరీ చేయడమెలా?

జ: సైబర్ మోసాలలో భాగంగా అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయితే వెంటనే బాధితులు తెలంగాణ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ 1930ని సంప్రదించి వెంటనే అకౌంట్ డిటెయిల్స్ ఇవ్వాలి. దీనినే గోల్డెన్ అవర్ అంటారు. అలా చేయడం వల్ల వేరే వారి అకౌంట్‌ని ఫ్రీజ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఆలస్యం చేస్తే ఉపయోగం ఉండదు. వెంటనే చేయడం వల్ల అకౌంట్‌లో నుంచి పోయిన డబ్బును తిరిగి తీసుకురావచ్చు.

ప్ర: పోగొట్టుకున్న ఫోన్‌లను కనిపెట్టడం ఎలా?

జ: ఎవరైనా తమ ఫోన్‌లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌లను కనిపెట్టవచ్చు. ఫోన్ పోగొట్టుకున్న వారు పోర్టల్‌లో పోయిన సెల్‌ఫోన్ వివరాలను నమోదు చేయాలి. సంబంధిత పోలీస్ అధికారులు ఫోన్‌లను ట్రేస్ చేస్తారు. వేరేవారు ఉపయోగించకుండా పోర్టల్ ద్వారా బ్లాక్ చేసుకోవడానికి వీలుంటుంది. దొరికిన తరువాత అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

ఎంఎంటీటీపీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ప్రొ.ప్రకాశ్‌బాబు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు యూజీసీ మాలవ్య మిషన్-టీచర్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ (ఎంఎంటీటీపీ) స్టాండింగ్ కమిటీ సభ్యుడుగా నియమితులయ్యారు. హెచ్‌సీయూలోని బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం ప్రొఫెసర్‌గానే కాకుండా హెచ్‌సీయూలోని ఎంఎంటీటీపీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఆయన విధులను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 116 ఎంఎంటీటీపీలలో అందించే కోర్సులపై పర్యవేక్షణ, విధాన సలహాలు, సిఫార్సులు చేయడానికి ఈ కమిటీ యూజీసీలో పనిచేస్తోంది. పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రకాశ్‌బాబును అభినందించారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ



ఓటరు స్లిప్‌ల పంపిణీలో ఈఆర్‌ఓ రజనీ కాంత్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీలో శనివారం ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు ఓటర్ స్లిప్‌లను అందజేస్తారని, సెక్టోరియల్ ఆఫీసర్స్ పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతినగర్‌లో..

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చందానగర్ సర్కిల్ 21 పరిధిలో వివిధ పోలింగ్ స్టేషన్‌ల వద్ద శనివారం ఓటర్ స్లిప్‌లను ఉపకమిషనర్ వంశీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ వివరాలు సమాచారంను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌ఓ సూపర్‌వైజర్లను ఆదేశించారు.

‘థండర్ ప్లస్ డీసీ ఫాస్ట్ చార్జర్’ ప్రారంభం



థండర్‌ప్లస్ డీసీ ఫాస్ట్ చార్జర్‌ను ప్రారంభించిన అభిజిత్ సిన్హ తదితరులు

మాదాపూర్: హైటెక్‌సిటీ ఎంఎంటీఎస్ స్టేషన్‌లో శనివారం ఎలక్ట్రిక్ 2 వీలర్, 3 వీలర్, 4 వీలర్ కోసం థండర్ ప్లస్ చార్జింగ్ స్టేషన్‌ను నేషనల్ హైవే ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రోగ్రామ్ మెంబర్ అభిజిత్ సిన్హ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీ ఓనర్‌లు థండర్‌ప్లస్ ఈవీ చార్జింగ్ స్టేషన్‌లను సులభంగా గుర్తించడానికి థండర్‌ప్లస్ యాప్‌ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ట్రినిటి క్లిన్‌టెక్ హర్ ఘర్ థండర్ ప్రచారంలో భాగంగా ఈవీ చార్జింగ్ స్టేషన్‌లను యుటిలిటీస్, రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు, హైవేలతో పాటు పారిశ్రామిక ప్రాంతాలలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. థండర్‌ప్లస్ డీసీ ఫాస్ట్ చార్జర్‌లో టైప్ 6 కనెక్టర్‌ను అమర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రినిటీ క్లీన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం

రాజకీయాలు, ఎన్నికల్లో డబ్బు పాత్ర అంశంపై సదస్సులో వక్తలు



నీలం రాజశేఖరరెడ్డి పరిశోధన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

హఫీజ్‌పేట్: కొండపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నీలం రాజశేఖరరెడ్డి పరిశోధన కేంద్రంలో రాజకీయాలు, ఎన్నికల్లో డబ్బు పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డాక్టర్ కిలారు పూర్ణచంద్రరావు, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బు ప్రభావం బాగా విస్తరించిందన్నారు. రాజకీయాల్లో, ఎన్నికల్లో పెరుగుతున్న డబ్బు పాత్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదంగా మారిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వటం ద్వారా నల్లడబ్బు ప్రభావం తగుతుందని, పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం చెప్పటంలో ఔచిత్యం లేదన్నారు. కేంద్ర ఆర్థికశాఖ పరిధిలో పని చేసే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క 29 శాఖలలో వ్యక్తులు గానీ, వ్యక్తుల సముదాయాలు, కంపెనీలు, కార్పొరేట్ సంస్థలుగానీ ఈ బాండ్లను సంవత్సరంలో 40 రోజుల పాటు కొనుగోలు చేసి, వాటిని తమ కిష్టమైన రాజకీయ పార్టీలకిస్తారన్నారు. వాటిని 15 రోజుల్లోగా ఆ రాజకీయ పార్టీలు తమ ఖాతాల్లోకి జమచేసుకోవచ్చన్నారు. అధికార పార్టీకి ఈ సమాచారం లభిస్తుంది కానీ ఇతర పార్టీలకు అందదన్నారు. నల్ల డబ్బు రూపంలో రాజకీయ పార్టీలకు డబ్బులుందుతున్నాయని స్పష్టమవుతుందన్నారు. ఈ సదస్సులో ఎన్‌ఆర్‌ఆర్‌సి కన్వీనర్ పి.జె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ పర్యవేక్షణలో వాలంటీర్లు, శానిటరీ విభాగం, హార్టికల్చర్ విభాగం సహకారంతో శనివారం క్యాంపస్‌లోని హ్యూమానిటీస్ భవన పరిసరాల్లో క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. అంతేకాకుండా హ్యూమానిటీస్ భవనం అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభంలో హరిత హారం మొక్కలు నాటి వాటిని పెంచేలా చూస్తామని, మిగతా రోజుల్లో క్లీనప్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, శానిటరీ విభాగం, హార్టికల్చర్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

సంగీత కచేరి



మాదాపూర్: అన్నమయ్య కీర్తనలతో కళాకారులు సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం చైతన్య లహరి మ్యూజిక్ అకాడమీ గురువు లహరినాథ్ శిష్యబృందం సంగీత కచేరీ చేశారు. బ్రహ్మమొక్కటే, నీవల్ల గుణదోష, కొమ్మలాల ఎంతవాడే, గోవింద గోవింద, కొండలలో నెలకొన్న కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్ ఎస్. అయ్యప్ప, మృదంగంపై హరికృష్ణ వాయిద్య సహకారాన్ని అందించారు.

ఏఐఎన్‌యూలో అరుదైన శస్త్ర చికిత్స

మాదాపూర్: పిల్లలకు ఒకసారి కిడ్నీలో రాళ్ళు వస్తే తర్వాత కూడా వైద్య పరీక్షలు చేయించాలని డాక్టర్ రాగూరి సూచించారు. మాదాపూర్‌లోని ప్రధాన అసుపత్రులలో ఒకటైన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ)లో శనివారం అరుదైన శస్త్రచికిత్స చేశారు వైద్యులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీలో రాళ్ళు ఏర్పడడం సర్వసాధారణమని ఒకే కుటుంబంలో తండ్రి, ఇద్దరు కుమారులకు అదే సమస్య ఉండడం అరుదు అని తెలిపారు. 13 సంవత్సరాల కుమారుడికి గతంలో కిడ్నీలో రాళ్ళు తొలగించినా మళ్ళీ తొలగించాల్సి వచ్చిందన్నారు. ఎడమవైపు మూత్ర పిండంలో ఒకటి, మూత్రనాళంలో మరోకటి, కుడివైపు ఒకటి ఉండడంతో రెండు వైపులా శస్త్ర చికిత్స చేసి తొలగించారు. పిల్లలకు ఆహారం విషయంలో నియంత్రణ పెట్టలేమని, సరిగ్గా నీళ్ళు తాగకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయని తెలిపారు.

మిల్లెట్స్ వాడకం పెరిగింది



మాట్లాడుతున్న శ్రీనివాస్

మాదాపూర్: సమాజం మొత్తం మిల్లెట్స్ వైపు దృష్టి సారించిందని ,మిల్లెట్స్ ఉత్పత్తి పెంపొందించేందుకు ఇదే మంచి సమయమని మిల్లెట్స్ మీడియా పోర్టల్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం, ఆహారం, చిరు ధాన్యాల విలువలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఔత్సాహిక వ్యాపార వేత్తలతో మాదాపూర్ వెస్ట్‌సైడ్ హోటల్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన వివిధ ప్రోడక్ట్ ఉత్పత్తి దారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే వివిధ స్కీమ్‌ల ద్వారా సబ్సిడీలతో కూడిన రుణాలను ఔత్సాహికులు పొందవచ్చని తెలిపారు. ప్రతీ మండలానికి ఒక మిల్లెట్స్ రిసోర్స్ పర్సన్‌ని నియమిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫోన్ 8297606789లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్గానిక్ ఉత్పత్తి దారులు పెరటితోట విత్తనాల సప్లై, ఆర్గానిక్ టూత్‌బ్రష్‌లు, షాంపులు, పప్పులు, ఇతర నిత్యావసర వస్తువులను ప్రదర్శించారు. ఫుడ్ టెక్నాలజీ నిపుణులు కిరణ్ గాదెల, ఆదిత్య, శివకుమార్, యమున పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కార్పొరేటర్ పూజితగౌడ్



ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ పూజిత

హఫీజ్‌పేట్: హస్తం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజితగౌడ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.

దాసరి నాగభూషణరావుకు నివాళి



నాగభూషణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు దాసరి నాగభూషణరావు వర్ధంతి సందర్భంగా కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో శనివారం ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాగభూషణరావు త్యాగనిరతిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.పూర్ణచంద్రరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ రజిని, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్ర ప్రిన్సిపల్ జోశ్యభట్ల కల్పన, కనపర్తి జ్యోత్స్న, వృద్ధాశ్రమ సలహా కమిటి సభ్యులు డాక్టర్ పి.సరస్వతి, రాజేంద్రరావు, మల్లంపాటి వెంటేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పురోగతి

షాట్ ఇండియా సీఓఓ స్మిత్‌షా



రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం ఎంతో పురోగతి సాధిస్తోందని షాట్ ఇండియా సంస్థ సీఓఓ స్మిత్‌షా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలో షాట్ ఇండియా స్టోర్‌ను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానమైన, వినోద అనుభవాలకు అత్యుత్తమ గమ్యస్థానంలో దేశంలో షాట్ ఇండియా గుర్తింపు పొందిందన్నారు. 2025 నాటికి గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో 40 శాతం మార్కెట్ స్వాధీనం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 550 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో రోబోటిక్ శస్త్రచికిత్స



చికిత్స వివరాలను వెల్లడిస్తున్న డా.రవికుమార్

మాదాపూర్: రెట్రోపెరిటోనియల్ ఫైబ్రోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న సూడాన్ పేషెంట్‌కు రోబోటిక్ శస్త్ర చికిత్స చేసి కాపాడారు మాదాపూర్ మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు. దీనికి సంబంధించి శనివారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ఎ.వి .రవి కుమార్ మాట్లాడుతూ ఆమె డీప్ వెయిన్ థ్రాంబోసిస్, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నట్టు తెలిపారు. ఆరోగ్య సమస్యల దృష్ట్యా రోబోటిక్ సర్జరీ వినూత్న ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించినట్టు తెలిపారు. సర్జరీ చేసే సమయంలో రక్తనాళాలతో ఏర్పడే సమస్యలను రోబోటిక్స్ ద్వారా తొలగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూరాలజిస్ట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ పార్థశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌హిల్స్, మధురానగర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్, మధురానగర్ కాలనీలలో శనివారం సాయంత్రం బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం చేశారు. మధురానగర్‌లోని ఎదురు గడ్డమైసమ్మ ఆలయంలో పూజల అనంతరం మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి బీఆర్‌ఎస్ పార్టీ కరపత్రాలను పంపిణీ చేసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్ అవగాహన రన్‌లో పాల్గొన్న అధికారులు, స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓటర్ అవగాహన రన్ నిర్వహించారు. ఈ రన్‌లో పలు కాలనీలవాసులు పాల్గొన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. ఈ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి జ్యోతిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డిజైన్ వ్యాన్‌గార్డ్



సాక్షి ,సిటీ బ్యూరో: సస్టైనబిలిటీ నేపథ్యంగా భావి డిజైనర్లు సృష్టించిన సరికొత్త డిజైన్లు ఆకట్టుకున్నాయి. ఓక్సన్ యూనివర్సిటీస్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఆధ్వర్యంలో నగరంలో తొలి ప్రదర్శనను డిజైన్ వ్యాన్ గార్డ్ పేరిట మాదాపూర్‌లోని టీ వర్క్స్‌లో శనివారం నిర్వహించారు. విద్యార్థులు విభిన్న రకాల దుస్తులను ప్రదర్శించారు. క్లైమేట్ ఛేంజ్, మెడ్‌టెక్ ,క్రాఫ్ట్స్ ఇన్నోవేషన్, హెరిటేజ్ కన్జర్వేషన్, ఇంక్లూజివ్ డిజైన్, మెంటల్ వెల్‌నెస్ వంటి సామాజిక అంశాలపై ఇరవై వినూత్న ప్రాజెక్టులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు అడివి శేష్‌తో బాటు డాక్టర్ అరుణ్‌కుమార్, పరాగ్ త్రివేది, తస్లిం ఆరిఫ్, శ్రీనివాస్ కొల్లిపర తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులను రక్షించుకోవాలి

సాక్షి ,సిటీ బ్యూరో: సాంకేతిక ఆధారిత ప్రపంచంలో మేధో సంపత్తి హక్కులను పరిరక్షించుకోవడానికి సమగ్ర అవగాహన అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. అసోచామ్ ఆధ్వర్యంలో రెసొల్యూట్ 4 ఐపి సహకారంతో ప్రపంచ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ దినోత్సవాన్ని మాదాపూర్‌లోని టీహబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోచామ్ స్టేట్ హెడ్ మచ్చా దినేష్‌బాబు మాట్లాడుతూ మేధో సంపత్తిని ప్రభావితం చేసే వినూత్న విధానాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో ప్రణవ గ్రూప్ సొసైటీ సీటీఓ, ఈడీ బూరుగు రాంబాబు, ఓయూ ప్రొఫెసర్.జీబీ రెడ్డి, టీహబ్ సీఈఓ శ్రీనివాస్, ఐపీఆర్ నిపుణులు పాల్గొన్నారు.

మోడీ వైపే ప్రజల మొగ్గు

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మాదాపూర్: మోడీ నాయకత్వాన్ని బలపరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మైనార్టీలను అడ్డంపెట్టుకుని కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండనగర్, మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మైనార్టీల జపం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ మైనార్టీలు ఎక్కువగా ఎక్కడ ఉంటే అక్కడి నుంచే పోటీ చేసి గెలవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400లకు పైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మార్తండనగర్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కొండాపూర్ కొత్తగూడ చౌరస్తా వరకు కొనసాగింది. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌యస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కమల ప్రసన్ననగర్ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వివేకానందనగర్ డివిజన్ కమలప్రసన్ననగర్ కాలనీ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: తెలంగాణ ప్రజల ఆత్మ ప్రతీక బీఆర్‌ఎస్ పార్టీ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ది కాలంలో దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్‌ఎస్‌కి దక్కిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాజాగూడలో..

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలకపాత్ర పోషించారని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖాజాగూడలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. గచ్చిబౌలి ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పటాన్‌చెరులో.. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మియాపూర్‌లో .. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు